శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

● ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఏసీపీ శ్రీనివాస్‌రావు



కూకట్‌పల్లిని నేర రహిత జోన్‌గా మార్చేందుకు ప్రజలను భాగస్వాములుగా చేసి శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నాం. గంజాయి సరఫరా, ఆకతాయిల వేధింపులు, దొంగతనాలు, పేకాట స్థావరాలు, వ్యభిచార కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. శుక్రవారం కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

- హైదర్‌నగర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి)

గంజాయి మాదకద్రవ్యాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తెలంగాణ ప్రభుత్వం గంజాయి, డ్రగ్ రహిత హైదరాబాద్‌ను నిర్మించేందుకు కృత నిశ్చయంతో ఉంది. దానికి అనుగుణంగా మేము పనిచేస్తున్నాం. నిత్యం నిఘా ఏర్పాటు చేశాం. కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నాం. గంజాయి నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరం.

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పరిధిలో వ్యభిచార నిర్మూలనకు ఎలాంటి కృషి చేస్తున్నారు?

వ్యభిచార వృత్తి నిర్మూలనకు ఇప్పటికే స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నాం. గత నెలలో 70మంది పోలీసులతో కలిసి ఒకేసారి 52మంది మహిళలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాం. నిత్యం పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ వ్యభిచారానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలతో తరుచూ సమావేశం అవుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ నేరాల నియంత్రణకు ప్రయత్నిస్తున్నాం.

సీసీ కెమెరాల ప్రక్రియ ఎలా ఉంది?

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని కాలనీల అసోసియేషన్లతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాం. కాలనీ అసోసియేసన్ వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలు చాలా కేసుల ఛేదనకు ఉపయోగపడుతున్నాయని ఇప్పటికే ప్రజల్లో సైతం చైతన్యం రావడంతో వ్యాపార కేంద్రాలు, ఇళ్లలో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో గంజాయి విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

హాస్టళ్ల నిర్వాహకులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించాం. హాస్టళ్లలో చేరేందుకు వచ్చే వారి సమగ్ర వివరాలు తీసుకోవడం, గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఆదేశించాం. హాస్టళ్లలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని హాస్టళ్ల నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చాం. వాటిని తప్పని సరిగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా సెక్టార్ల ఎస్సైలపై ఉంది. ఆదేశాలు బేఖాతరు చేసే హాస్టళ్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



ఫతేనగర్ ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డులో ఫుట్‌పాత్‌లపై పెట్టిన మెటీరియల్



ఫుట్‌పాత్‌పై పెట్టిన యంత్ర సామగ్రి



ఫుట్‌పాత్‌లపై ఇలా ఉంటే నడిచేదెలా..



ఫుట్‌పాత్‌పై నడిచే వీలు లేకుండా సామగ్రి

- ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డులో కనిపించని ఫుట్‌పాత్‌లు
- లక్షలాది రూపాయలు వృథా
- ఇబ్బంది పడుతున్న పాదచారులు
- పట్టించుకోని అధికారులు

ఫతేనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ ఓల్డు ఎయిర్‌పోర్టు రోడ్డులో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్ పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా ఫతేనగర్, శోభనా కాలనీ వైపు వచ్చే పాదాచారులు ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు వీలు లేకపోవడంతో రోడ్డుపైనే నడవాల్సివస్తోంది. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. బతుకమ్మ రోడ్డు నుంచి ఓల్డు ఎయిర్ పోర్టు రోడ్డు వరకు ఏ ఫుట్‌పాత్‌ను చూసిన ఆక్రమనలు, షెడ్ల నిర్మాణాలే కనిపిస్తుంటాయి. ఈ రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో యువతీ యువకులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తుంటారు. బోయినపల్లి, ఫిరోజ్‌గూడ నుంచి వచ్చే వాహనాలు మితిమీరిన వేగంతో వస్తుండడంతో రోడ్డుపై నడిచే వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలని పలుసార్లు మూసాపేట్ సర్కిల్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, కార్పొరేటర్ స్పందించి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించి పాదచారుల ప్రాణాలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.27, వంకాయ రూ.50, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.60, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.42, క్యాబేజీ రూ.33, బీన్స్ రూ.60, క్యారెట్ రూ.70, గోబి పువ్వు రూ.18, దొండకాయ రూ.28, చిక్కుడుకాయ రూ.65, గోరుచిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.47, క్యాప్సికం రూ.65, ఆలుగడ్డ రూ.39, కీర రూ.18, దోసకాయ రూ.35, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.65, ఉల్లిపొరక రూ.50, ఉల్లిగడ్డ రూ.45, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ. 50-60, మునగకాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ. 380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ. 45, ఆ కాకరకాయ రూ. 100. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీసీ కులగణన పేరుతో మోసం చేస్తే ఊరుకోం



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో జీహెచ్‌ఎంసీ అధికారులు

హైదర్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన పేరిట ప్రజలను మోసం చేస్తే బీఆర్‌ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇంటి వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీసీ కులగణన సర్వేను స్వాగతిస్తున్నామని, కానీ ఎమ్మెల్యేలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అసెంబ్లీ పెట్టకుండా సొంత నిర్ణయాలతో ప్రభుత్వం సర్వేను చేపట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉన్న అనుమానాలను అడుగుతుంటే ఎమ్మెల్యేగా ఏమి చెప్పలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. బీసీ సర్వేలో కులం వివరాలు కాకుండా ఆస్తుల వివరాలు, అకౌంట్ వివరాలు అడుగుతున్నారని వారి అనుమానాలను ప్రభుత్వం తీర్చాలని పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే మాత్రం బీఆర్‌ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బీసీ కులగణనతో పాటుగా ఎస్సీ వర్గీకరణను కూడా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, సంతోష్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రామాలయానికి 150 కేజీల ఇత్తడి గంట

హైదర్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రామాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు 150 కేజీల ఇత్తడి గంటను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు నాయినేని సూర్యారావు, లక్ష్మీబాయి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి, చైర్మన్ తులసిరావు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన, సాంకేతికత ఆవిష్కరణల కోసం

బిట్స్, యూబీ యూనివర్సిటీల మధ్య ఒప్పందం



బిట్స్ పిలానీ, యుబీ యూనివర్సిటీల ప్రతినిధులు

బిట్స్‌పిలానీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్య, ఆర్టిఫిషియల్‌తో సహా కీలకమైన రంగాల్లో పరిశోధనను అభివృద్ధి చేసే లక్ష్యంతో బిట్స్‌పిలానీ, యూనివర్సిటీ ఆఫ్ బఫెలో (యూబీ) స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌లు భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ రాంగోపాల్‌రావు తెలిపారు. ఈ సహకారం ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో పరిశోధనను ముందుకు తీసుకెళ్లడం, మా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశోధన, అవిష్కరణల్లో అత్యుత్తమంగా పేరుగాంచిన భారతదేశంలోని ప్రముఖ సంస్థ అయిన బిట్స్‌పిలానీతో భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందని యూబీ ప్రెసిడెంట్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ స్కాట్ వెబర్ సహకారం వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ భాగస్వామ్యంతో రెండు సంస్థలకు క్లిష్టమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి, విద్యా పరిశోధన- ఆధారిత వృద్ధికి ప్రపంచ వేదికను రూపొందించడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుందని వెల్లడించారు.

స్మారక పోస్టర్ స్టాంప్ విడుదల



ఆర్మీ పోస్టల్ సర్వీస్ జారీ చేసిన ప్రత్యేక కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ, ఎయిర్ కమోడోర్ హెచ్‌జె.పేజ్ తదితరులు

అల్వాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ బేగంపేట్‌లో ఉన్న భారత వైమానిక దళం ప్రాంతీయ పరీక్షల బోర్డు(శిక్షణ) శుక్రవారం ప్లాటినం జూబ్లీ (75 సంవత్సరాలు) ఉత్సవాలను జరుపుకొంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్(విద్య) ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ సెమినార్‌కు అధ్యక్షత వహించారు. బేగంపేట్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ కమాండింగ్, ఎయిర్ కమోడోర్ హెచ్‌జె.పేజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రారంభ ఉపన్యాసంలో గ్రూప్ కెప్టెన్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాల బోర్డు ప్రయాణం గురించి వివరించారు. ఈ ముఖ్యమైన సందర్భాన్ని పురస్కరించుకొని ఆర్మీ పోస్టల్ సర్వీస్ జారీ చేసిన ప్రత్యేక కవర్, ప్రాంతీయ పరీక్షల బోర్డు(శిక్షణ)స్మారక పోస్టల్ స్టాంప్‌ను ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్‌శర్మ ఆవిష్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడా కారులు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కేపీహెచ్‌బీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి ముగ్గురు క్రీడా కారులు ఎంపికయ్యారు. ఈనెల 3న ఏఎస్‌రావు నగర్‌లో 70వ ఇంటర్ డిస్ట్రిక్ సెలక్షన్స్‌కు రంగారెడ్డి జిల్లా తరపున కేపీహెచ్‌బీ నుంచి వై.రమేష్, ఆర్.అశోక్ కుమార్ గౌడ్, బి.పెద్దిరెడ్డి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు హన్మకొండలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శుక్రవారం కేపీహెచ్‌బీ నుంచి బయలు దేరినట్టు అసోసియేషన్ చైర్మన్ జాలూరి నారాయణరావు, అధ్యక్షుడు పీఎస్‌వీ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మోర్ల రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేసి ప్రోత్సహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుకు అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలకు శారద



కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్న బి.శారద రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గుర్రంగూడలో శుక్రవారం జీఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ప్రిన్సిపాల్ వెంకటయ్య విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

డీసీకి శుభాకాంక్షలు



మూసాపేట్ సర్కిల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణను శుక్రవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

జెడ్సీకి వినతి



జెడ్సీ అపూర్వ్ చౌహాన్‌తో శుక్రవారం బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు సమావేశమయ్యారు. శివశక్తి నగర్, శ్రీహరినగర్‌లలో వరదనీటి కాల్వ, సీసీ రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ప్రభాకర్ గౌడ్, భాస్కర్ రావు, సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

ధోబీఘాట్ ప్రహరీ పనుల పరిశీలన



కేపీహెచ్‌బీ మూడో‌ఫేజ్‌లోని కొనసాగుతున్న ధోబీఘాట్ ప్రహరీ నిర్మాణ పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శుక్రవారం ఏఈ సాయిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నామని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని ధోబీఘాట్ సభ్యులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి)

అక్రమ నిర్మాణం.. ఆపుతారా లేదా?



ధర్మారెడ్డి ఫేజ్-2లో అక్రమ నిర్మాణం అడ్డుకోకుండా అధికారులు కాలయాపన చేస్తుండడంపై స్థానికులు శుక్రవారం రోడ్డు మూసేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని జీహెచ్‌ఎంసీ అధికారులకు విషయం తెలపడంతో వారు అక్కడకు వచ్చి పనులు ఆపేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

11 మంది ట్రాన్స్ జెండర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తిన్న 11 మంది ట్రాన్స్ జెండర్లను సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీవింగ్ అధికారులు అరెస్ట్ చేశారు. కమిషనరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్ జెండర్లు అసభ్యకర చేష్టలు చేస్తున్నట్టు పలు ఫిర్యాదులు వచ్చాయి. దాంతో సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏసీపీ వి.ప్రసన్న కుమార్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి ఈ నెల 7న రాత్రి సమయంలో మాదాపూర్, గచ్చిబౌలి, అల్లాపూర్ పోలీస్టేషన్‌ల పరిధిలో నిఘా పెట్టారు. మాదాపూర్ పోలీస్టేషన్ పరిధిలో 8 మంది, కొండాపూర్ పరిధిలో ఇద్దరు, అల్లాపూర్ పోలీస్టేషన్ పరిధిలో ఒకరు మొత్తం 11 మంది ట్రాన్స్ జెండర్లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

పాలసీపై వడ్డీలేని రుణం అంటూ.. రూ.1.73 లక్షలు కాజేత

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మీరు తీసుకున్న ఇన్సూరెన్స్ పాలసీపై వడ్డీ లేని రుణం ఇస్తామని నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు రూ.1.73 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యాపారి(62)కి సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి తాము బజాజ్ ఫైనాన్స్ సంస్థ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీరు ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే వడ్డీ లేకుండా రూ.10 లక్షలు రుణం ఇస్తామని, అందుకు సంబంధించిన వివరాలను వాట్సప్ చేశారు. ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి "గ్యారెంటీడ్ పెన్షన్ ప్లాన్" తీసుకోవాలని సూచించారు. ఇన్సూరెన్స్ పాలసీకి సంబంధించి రూ.80 వేలు ప్రీమియం కట్టాలని చెప్పి తమ ఖాతాలో జమ చేయించుకున్నారు. తర్వాత లోన్‌కు సంబంధించి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరి అని చెప్పి మరో రూ.56 వేలు బదిలీ చేయించుకున్నారు. ఇలా పలు కారణాలు చెబుతూ ఆగస్టు 9వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకు పలు దఫాలుగా రూ. 1.73లక్షలు వసూలు చేశారు. మూడు నెలలైనా లోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి పీఏ సెల్‌ఫోన్ చోరీ

బంజారాహిల్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి పీఏ సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 31న జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో దీపావళి పండుగ సందర్భంగా క్వార్టర్ నెంబర్ 7లో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు అతడి పీఏ సతీష్ కుమార్ వచ్చారు. పూజలు ముగిసిన తర్వాత జేబులో చూసుకోగా పీఏ సతీష్‌కుమార్ ఫోన్ కనిపించలేదు. గురువారం రాత్రి బంజారాహిల్స్ స్టేషన్‌లో పీఏ ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

● యువకుడిపై కేసు

చాదర్‌ఘాట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిపై చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన 23 ఏళ్ల యువతి ఓల్డ్‌మలక్‌పేటలో నివాసముంటోంది. ఆమె ప్రైవేటు ఉద్యోగి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అనిల్(25) ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తూ ఓల్డ్‌మలక్‌పేటలోని మున్సిపల్ కాలనీలో నివాసముంటున్నాడు. ఏడేళ్ల నుంచి యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. పెళ్లి చేసుకోమని యువతి అడిగితే మొదట్లో వాయిదా వేస్తూ వచ్చాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోనని చెప్పడంతో మోసపోయానని యువతి చాదర్‌ఘాట్ పోలీసులను ఆశ్రయించింది. యువతి ఫిర్యాదు మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కేసు

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. బతుకుదెరువు కోసం ఓ తల్లి ఇద్దరు కూతుళ్లతో కలిసి సైదాబాద్ పీఎస్ పరిధిలో నివాసముంటోంది. వీరి దగ్గరి బంధువైన యువకుడి(20)తో బాలిక(14) ప్రేమలో పడింది. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడి శారీరక సంబంధం వరకు వెళ్లింది. దీంతో బాలిక గర్భం దాల్చింది. కూతురు అనారోగ్యానికి గురవడంతో తల్లి నిలదీయగా అసలు విషయం వివరించింది. ఈమేరకు బాలిక తల్లి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అత్తపై అత్యాచారం చేసిన అల్లుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మత్తుమందు ఇచ్చి అత్తపై అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్న అల్లుడు మొహమ్మద్ షాకేర్‌ను బాలాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన షాకేర్ అత్తకు కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి స్పృహ కోల్పోయాక ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు సాకేర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

హయత్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో ఉన్న నగదు, నగలను దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... కుంట్లూరు రవిశంకర్ కాలనీలో గణేష్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో బంధువులు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి దిన కార్యములకు వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తాళాలు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో ఉన్న లక్ష రూపాయలు, 50 తులాల వెండి, తులం బంగారు గొలుసు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించిన గణేష్ శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మటన్ దుకాణం ఏర్పాటు విషయంలో ఘర్షణ

● కత్తులతో దాడి, ముగ్గురికి గాయాలు

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మాంసం దుకాణం ఏర్పాటు విషయంలో జరిగిన వివాదం కత్తిపోట్లకు దారి తీసి ముగ్గురికి గాయాలయ్యాయి. చంచల్‌గూడలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా ఉన్న ఓ మడిగెలో ఓ వ్యక్తి మాంసం దుకాణం ఏర్పాటు చేయాలనుకున్నాడు. ఇందుకు స్థానికంగా ఉన్న మటన్ దుకాణం వ్యాపారి అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం నెలకొంది. దీంతో ఇరువురు వ్యాపారులకు సంబంధించిన బంధువులు అక్కడికి చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు జోక్యం చేసుకొని ఇరు గ్రూపులను అక్కడి నుంచి పంపించారు. ఓ వ్యాపారికి చెందిన వ్యక్తులు కత్తులతో డబీర్‌పురా ఆర్‌ఓబీ పక్కనే ఉన్న హౌజ్దార్‌ఖాన్, జీమాన్‌ఖాన్ ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేసి ముగ్గురిని గాయపరిచారు. క్షతగాత్రులను మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించారు. మాదన్నపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం డ్రగ్స్ అమ్మకాలు

● విక్రేతతో పాటు ముగ్గురు కొనుగోలుదారుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

జీడిమెట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడ్డ ఓ యువకుడు అడ్డదారుల్లో డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ విక్రేతగా మారాడు. ఇతడితో పాటు ముగ్గురు కొనుగోలుదారులను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ, పేట్ బషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ. 4లక్షల 40వేలు విలువైన 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుజరాత్ రాష్ట్రం, భావానగర్‌కు చెందిన గులానీ ఆసిఫ్(30) నగరానికి వచ్చి కొంపల్లి ప్రాంతలోని ఓ బేకరీలో పని చేస్తున్నాడు. జల్సా చేసేందుకు అవసరమైన డబ్బు సంపాదించేందుకు ముంబైలో ఉండే అలీ అనే వ్యక్తి నుంచి ఎండీఎంఏతో పాటు, డ్రై గంజాయి తీసుకొచ్చి నగరంలో సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేస్తూ యువతకు విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం కొంపల్లిలో తరుణ్ వ్యాస్(30), మహ్మద్ ఇక్బాల్(26), సుశాంత్‌కుమార్‌రెడ్డి(27)కు విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్ ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీ శోభన్‌కుమార్, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ కె.విజయవర్ధన్, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

హైదర్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ మాతృశ్రీనగర్‌కు చెందిన వీవీ ఎస్ఎస్ఆర్ రవితేజ అనారోగ్యంతో వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి మంజూరు చేసుకున్నారు. కాగా ఆయనకు మంజూరైన రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తన కార్యాలయంలో రవితేజ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.



క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్

ఘనంగా క్రీడావార్షికోత్సవం

గచ్చిబౌలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఎదుగుతారని సికింద్రాబాద్ పాస్‌పోర్టు ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఓబుల్‌రెడ్డి పాఠశాల వార్షిక క్రీడోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఇటీవల విద్యార్థులు ఎక్కువశాతం సోషల్ మీడియాకు ఆకర్షితులవుతున్నారని సోషల్‌మీడియాలో వచ్చేవన్నీ అసత్యాలేనని వాటిని నమ్మవద్దని, విద్యార్థులు సోషల్‌మీడియాకు ఎంతదూరంగా ఉంటే అంతమంచిదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కబరిస్తే వారు మంచి మార్గంలో వెళ్తారన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అస్కారం ఉందన్నారు. క్రీడలు శారీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. వివిధ క్రీడల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 2023-24 విద్యాసంవత్సరంలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, అవార్డులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వినీత స్వాగత ఉపన్యాసం చేస్తూ వార్షిక నివేదిక వివరించారు. తమ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడంలో నిబద్ధతను పాటిస్తుందని గత ఏడాది అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు నిరూపించారన్నారు. అనంతరం ఓబుల్‌రెడ్డి ఎడ్యుకేషన్ అకాడమి చైర్మన్ ఎస్‌వీ రావు, హైకోర్టు జడ్జి అభినందన్‌కుమార్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైటెక్ సిటీలో.. ట్రాఫిక్ కష్టాలు

- నిత్యం ట్రాఫిక్ జాంతో అవస్థలు
- సమయానికి విధులకు హాజరు కాలేకపోతున్న ఉద్యోగులు

మాదాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ఏ రోడ్డు చూసినా నిత్యం ట్రాఫిక్‌జామ్‌లే... తాజాగా రెండు అండర్ పాస్‌లు ప్రారంభించారు. వాహనదారులు ఇక తమకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే అనుకున్నారు... కానీ వారి ఆశ నిరాశయింది. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలతో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. సమయానికి విధులకు వెళ్లలేక ఒకవైపు... తలనొప్పి కళ్లమంటలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్‌జాంలతో వాహనదారుల అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ్లలో మాదాపూర్ ఐటీ కారిడర్‌కు వచ్చిపోయే కార్లు మూడు నుంచి 5 లక్షల వరకు రాకపోకలు కొనసాగిస్తాయి. ముఖ్యంగా హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ నుంచి సైబర్‌టవర్‌కు వచ్చే రహదారిలో ఉదయం, సాయంత్రం మియాపూర్, చందానగర్ నుంచి హైటెక్‌సిటీకి వచ్చేవారు మంజీరపైపులైను రోడ్డు నుంచి హైటెక్‌సిటీ చేరుకుంటారు.. మరోవైపు కూకట్‌పల్లి నుంచి వాహనాలు సైతం ఈ రహదారిపై రావడంతో భారీగా ట్రాఫిక్‌జాంతో గంటల కొద్ది రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందని ఐటీ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు (ఫైల్)

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి...

హైటెక్‌సిటీలో ఉదయం సాయంత్రం ట్రాఫిక్ తలుచుకుంటే భయమేస్తుంది. కొన్ని రహదారుల్లో ఫుట్‌పాత్‌లు, అభివృద్ధి పనులతో రోడ్లు ఇరుకుగా మారాయి. దీంతో తరుచూ ట్రాఫిక్‌జాం అవుతుంది. కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది ఉండటంతో లేదు. వాహనదారులు ఇషారాజ్యంగా వెళ్లడంతో ఇబ్బందులు పడుతున్నాం. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలి.

- శంకర్, ఐటీ ఉద్యోగి

మోకాలి మార్పిడి సర్జరీలో ఏఆర్ సాంకేతికత

రాయదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అగ్మెంటెడ్ రియాలిటీ మోకాలి మార్పిడి, రోబోటిక్ మోకాలి మార్పిడికి కచ్చితమైన ప్రత్యామ్నాయం ఏఆర్ టెక్నాలజీని గచ్చిబౌలిలోని ఆరెటే ఆస్పత్రి ఆధునాతన ఆర్థోపెడిక్ కేర్‌లో అగ్రగామిగా నిలిచిందని రోబోటికల్ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ప్రభావత్‌రెడ్డి లక్కిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన అగ్మెంటెడ్ రియాల్టీ (ఏఆర్) సాంకేతికతతో తక్కువ ఖర్చుతో కచ్చితమైన అద్భుత ఫలితాలను అందిస్తు దీర్ఘకాలిక ప్రయోజనం అందించే ఈ సర్జరీ విధానాన్ని వివరించారు. ఏఆర్ సాంకేతికత శస్త్ర చికిత్స సమయంలో ఎక్కువ సౌలభ్యం, అనుకూలతకు విలుకల్పిస్తుందన్నారు. మోకాళి పరిస్థితులపై ఆధారపడి ప్రణాళికను మార్చగల డైనమిక్ సర్దుబాటులను ఈ టెక్నాలజీ అనుమతి ఇస్తుందన్నారు. తద్వారా శస్త్రచికిత్స కచ్చితత్వం పెంచుతుందని, సర్జరీ అనంతరం నొప్పిని తగ్గించి రోగులు కోలుకునేలా చేస్తుందన్నారు. ఈ సాంకేతికతతో క్లిష్టమైన విధానాలు కూడా కచ్చితమైనవిగా మారతాయని ఆయన పేర్కొన్నారు. మెడికల్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ ఎన్.పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఏటీ ఆస్పత్రిలో సంరక్షణ శ్రేష్ఠతను పునర్నిర్వహించడానికి మోకాళి మార్పిడి శస్త్రచికిత్సలో అగ్మెంటెడ్ రియాల్టీ సాంకేతికతను ఏకీకృతం చేయడంలో మాప్రయత్నం విజయవంతంగా ముందుకు సాగుతుందన్నారు. కచ్చితత్వం, వ్యక్తిగతికరణ పట్ల తమ అంకితభావం, మోకాలి అలైన్‌మెంట్ ట్రీట్‌మెంట్‌లో ఆరెటే ఆస్పత్రి అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆరెటే ఆస్పత్రి చైర్మన్ డాక్టర విజయేందర్‌రెడ్డి తీగల ఏఆర్ సాంకేతికతను ఆర్థోపెడిక్ సంరక్షణలో ముందజలో ఉన్నందుకు ఆనందరంగా ఉందన్నారు. టెక్నాలజీ ద్వారా ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన ఇన్‌ప్లాంట్ అలైన్‌మెంట్, వేగవంతమైన రికవరీ వంటి సౌలభ్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్జన్ డాక్టర్ ప్రభావత్‌రెడ్డి లక్కిరెడ్డి, వైద్యులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు టీఎన్‌జీఎస్‌కాలనీలో, జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీ కాలనీ, 11.30 నుంచి 12.00 గంటల వరకు నానక్‌రాంగూడ, 12 నుంచి 12.30 గంటల వరకు జర్నలిస్టులకాలనీ, 12.30 నుంచి 1 గంట వరకు టీఎన్‌జీఓస్‌కాలనీ, 1.00 నుంచి 1.30 వరకు సాయిఐశ్వరయ్య, ఖాజాగూడ, 1.30 నుంచి 2 గంటల వరకు ప్రశాంత్‌హిల్స్, 2.00 నుంచి 2.30 గంటల వరకు పద్మశ్రీగార్డెన్, గౌలిదొడ్డి, 2.30 నుంచి 3 గంటల వరకు గౌలిదొడ్డి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

11న జాతీయ విద్యాదినోత్సవం

గచ్చిబౌలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవాన్ని లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొని విద్య ప్రాముఖ్యతను వివరిస్తారని పేర్కొన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్య వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు.

నేడు ధర్మపురి క్షేత్రంలో పార్వతి కల్యాణం హరికథా గానం

మియాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్ ధర్మపురి క్షేత్రంలో శనివారం సాయంత్రం ప్లాన్‌జేరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శంకర్‌నారాయణ, రాజ్యలక్ష్మి సౌజన్యంతో ప్రముఖ భాగవతారిని సప్ప భారతి పార్వతి కల్యాణం హరికథా గానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

మియాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవానికి పాడిపంటల పరిరక్షణకు నడుంబిగించిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి వలిగొండ మూసీ వెంట చేపట్టిన పాదయాత్రలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సదర్భంగా రేవంత్‌రెడ్డికి ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ఎండీసీ బ్యాడ్మింటన్ సెమీస్‌లో అనుపమ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎన్ఎండీసీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ చాలెంజ్‌లో అనుపమ ఉపాధ్యాయ సెమీస్‌లో ప్రవేశించింది. శుక్రవారం గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో అనుపమ 21-18, 27-25తో శ్రియపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో తరుణ్ రెడ్డి 22-20, 22-24, 21-15తో రవిపై నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్వికా శివానీ జోడీ 21-14, 14-21, 21-17తో ధ్రువ్ రావత్-రాధిక శర్మపై నెగ్గి, సెమీస్‌లో ప్రవేశించింది.

యువకుడి అదృశ్యం

రాయదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి పంచవటి కాలనీ రాజశ్రీహోమ్స్ అపార్టుమెంట్‌లో నివాసం ఉండే లవరాజు కుమారుడు లచ్చన(19) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో తండ్రి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

11 మంది ట్రాన్స్ జెండర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తిన్న 11 మంది ట్రాన్స్ జెండర్లను సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీవింగ్ అధికారులు అరెస్ట్ చేశారు. కమిషనరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్ జెండర్లు అసభ్యకర చేష్టలు చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు వచ్చాయి. దాంతో సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏసీపీ వి. ప్రసన్నకుమార్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి ఈ నెల 7న రాత్రి సమయంలో మాదాపూర్, గచ్చిబౌలి, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిఘా పెట్టారు. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 మంది, కొండాపూర్ పరిధిలో ఇద్దరు, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు మొత్తం 11 మంది ట్రాన్స్ జెండర్లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

అత్తపై అత్యాచారం చేసిన అల్లుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ : మత్తుమందు ఇచ్చి అత్తపై అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్న అల్లుడు మొహ్మద్ షాకేర్‌ను బాలాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన షాకేర్ అత్తకు కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి స్పృహ కోల్పోయాక ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు షాకేర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వాల్‌పై వేస్తున్న చిత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బ్రిడ్జి వాల్‌పై అందమైన చిత్రాలు

మియాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ అండర్ బ్రిడ్జిలో సీఎస్ఆర్ ఫండ్ ద్వారా చేపడుతున్న వాల్ కలరింగ్, వాల్ బొమ్మల కార్యక్రమాన్ని శుక్రవారం చందానగర్ సర్కిల్ డీసీ స్రవంతి, ఈఈ రాజు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలను వాహనదారులు, ప్రజలు ఆస్వాదించేందుకు అండర్ బ్రిడ్జిలపై సుందరీకరణ చేస్తున్నామని, ఈ చిత్రాలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నదీమ్

ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలి

- అటవీ పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ముసాయిదా విడుదల చేశారన్నారు. ఆ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందన్నారు. డిసెంబరు 24న క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కరిస్తారని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న తుదిజాబితా ప్రకటించి, జనవరి 6న విడుదల చేస్తార న్నారు. ఓటరు జాబితా తయారీలో పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. జనవరి 1, 2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు,. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫీకర్‌అలీ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, అజయ్‌కుమార్, నాయకులు రాజేష్‌కుమార్, నందకుమార్ మమ్మద్ సోహెల్, శ్రీనివాస్, ఖాజా మొయినుద్దీన్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్మీ పోస్టల్ సర్వీస్ జారీ చేసిన ప్రత్యేక కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ, ఎయిర్ కమోడోర్ హెచ్‌జె.పేజ్ తదితరులు

స్మారక పోస్టర్ విడుదల

అల్వాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ బేగంపేట్‌లో ఉన్న భారత వైమానిక దళం ప్రాంతీయ పరీక్షల బోర్డు(శిక్షణ) శుక్రవారం ప్లాటినం జూబ్లీ (75 సంవత్సరాలు) ఉత్సవాలను జరుపుకుంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్(విద్య) ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ సెమినార్‌కు అధ్యక్షత వహించారు. బేగంపేట్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ కమాండింగ్, ఎయిర్ కమోడోర్ హెచ్‌జె.పేజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రారంభ ఉపన్యాసంలో గ్రూప్ కెప్టెన్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాల బోర్డు ప్రయాణం గురించి వివరించారు.

ఈ ముఖ్యమైన సందర్భాన్ని పురస్కరించుకొని ఆర్మీ పోస్టల్ సర్వీస్ జారీ చేసిన ప్రత్యేక కవర్, ప్రాంతీయ పరీక్షల బోర్డు(శిక్షణ)స్మారక పోస్టల్ స్టాంప్‌ను ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్‌శర్మ విడుదల చేశారు.

వైభవంగా కొనసాగుతున్న లక్ష దీపోత్సవం

చందానగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో కార్తీకమాస లక్ష దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి విశేషపూజలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన కార్యక్రమంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు, సాయంత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ఆగమశాస్త్రయుక్తంగా వేద పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ యువి రమణమూర్తి, కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు మురళీధర్‌శర్మ, భక్తులు తదితరులు ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న ఆలయకమిటీ సభ్యులు

ఎన్‌క్రిప్షన్.. ఇంటర్నెట్ వినియోగదారుల ప్రాథమిక హక్కు

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ (ఎస్‌సీఐఎస్), ఇంటర్నెట్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ సంయుక్తంగా గ్లోబల్ ఎన్‌క్రిప్షన్ దినోత్సవాన్ని నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నెట్ సొసైటీ ప్రెసిడెంట్ మోహన్ రాయుడు మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ సమగ్రతను నిర్ధారించడానికి ఎన్‌క్రిప్షన్‌ల ప్రాముఖ్యత పెరిగిందని, భవిష్యత్‌లో ఎన్‌క్రిప్షన్ అనేది ఇంటర్నెట్ వినియోగదారుల ప్రాథమిక హక్కుగా మారాలని అన్నారు. ఎస్‌సీఐఎస్ డీన్ ప్రొఫెసర్ అతుల్ నేగి మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం అటాక్స్ నేపథ్యంలో ఎన్‌క్రిప్షన్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్స్‌లర్ బీజే రావు మాట్లాడుతూ.. ఇటువంటి సెషన్‌లు గోప్యతా అవసరాలను తెలుసుకోవడానికి, డిజిటల్ సామాజిక అవగాహనను పెంపొందించేందుకు దోహద పడతాయన్నారు. గణిత శాస్త్రజ్ఞులు, సైబర్ భద్రతా నిపుణులు ఎన్‌క్రిప్షన్, క్రిప్టోగ్రఫీ, క్వాంటం కమ్యూనికేషన్‌ల ద్వారా భద్రతా అవసరాలను పరిశీలించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్. రుక్మరేఖ కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్‌క్రిప్షన్ దినోత్సవంలో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొఫెసర్ బీజేరావు, వేదికపై ఇంటర్నెట్ సొసైటీ అధ్యక్షుడు మోహన్‌రాయుడు

జల్సాల కోసం డ్రగ్స్ అమ్మకాలు

జీడిమెట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడ్డ ఓ యువకుడు అడ్డదారుల్లో డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ విక్రేతగా మారాడు. ఇతడితో పాటు ముగ్గురు కొనుగోలుదారులను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు పట్టుకొన్నారు. వీరి నుంచి రూ.4.4 లక్షల విలువైన 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శుక్రవారం మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుజరాజ్ రాష్ట్రం, భావానగర్‌కు చెందిన గులానీ ఆసిఫ్(30) నగరానికి వచ్చి కొంపల్లి ప్రాంతలోని ఓ బేకరీలో పని చేస్తున్నాడు. జల్సా చేసేందుకు అవసరమైన డబ్బు సంపాదించేందుకు ముంబైలో ఉండే అలీ అనే వ్యక్తి నుంచి ఎండీఎంఏతో పాటు, డ్రై గంజాయి తీసుకువచ్చి నగరంలో సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేస్తూ యువతకు విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం కొంపల్లిలో తరుణ్‌వ్యాస్(30), మహ్మద్ ఇక్బాల్(26), సుశాంత్‌కుమార్‌రెడ్డి(27)లకు విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్ ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీ శోభన్‌కుమార్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ కె.విజయవర్ధన్, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

పరిశోధన, సాంకేతికత ఆవిష్కరణల కోసం

బిట్స్, యూబీ యూనివర్సిటీల మధ్య ఒప్పందం

బిట్స్‌పిలానీ, నవంబరు 08 (ఆంధ్రజ్యోతి): విద్య ఆర్టిఫీషియల్‌తో సహా కీలకమైన రంగాలలో పరిశోధనను అభివృద్ధి చేసే లక్ష్యంతో బిట్స్‌పిలానీ, యూనివర్సిటీ ఆఫ్ బఫెలో (యూబీ) స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌లు భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు బిట్స్ పిలానీ వైస్ చాన్స్‌లర్ రాంగోపాల్‌రావు తెలిపారు. ఈ సహకారం ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో పరిశోధనను ముందుకు తీసుకెళ్లడం, మా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశోధన, ఆవిష్కరణలలో అత్యుత్తమంగా పేరుగాంచిన భారతదేశంలోని ప్రముఖ సంస్థ అయిన బిట్స్‌పిలానీతో భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందని యూబీ ప్రెసిడెంట్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ స్కాట్ వెబర్ సహకారం వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ భాగస్వామ్యంతో రెండు సంస్థలకు క్లిష్టమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి, విద్యా పరిశోధన- ఆధారిత వృద్ధికి ప్రపంచ వేదికను రూపొందించడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుందని వెల్లడించారు.



బిట్స్ పిలానీ, యూబీ యూనివర్సిటీల ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న నదీమ్

ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలి

● అటవీ పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ముసాయిదా విడుదల చేశారన్నారు. ఆ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందన్నారు. డిసెంబరు 24న క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కరిస్తారని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న తుదిజాబితా ప్రకటించి, జనవరి 6న విడుదల చేస్తారన్నారు. ఓటరు జాబితా తయారీలో పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. జనవరి 1, 2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్‌అలీ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, అజయ్‌కుమార్, నాయకులు రాజేష్‌కుమార్, నందకుమార్ మమ్మద్ సొహైల్, శ్రీనివాస్,ఖాజా మొయినుద్దీన్, కొల్లూరు పవన్‌కుమార్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రాజీవ్ గృహకల్పలో భూకబ్జాలను అరికట్టండి

జీడిమెట్ల, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గృహకల్పలో జరుగుతున్న భూకబ్జాలను అరికట్టాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ రహమాన్‌కు సీపీఐ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని 12,24,32,49 బ్లాక్‌ల వద్ద ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని, వెంటనే ఆ భూమిని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, రాజీవ్‌గృహకల్ప పక్కన ఉన్న ప్రభుత్వ భూమి గతంలో కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులు కూల్చివేశారని, తిరిగి అదే స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి 30 లక్షలకు విక్రయించారన్నారు. ఈ వ్యవహారం కొందరు రెవెన్యూ సిబ్బంది, అధికారుల పాత్ర కూడా ఉందన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు ఏసురత్నం, కార్యవర్గ సభ్యులు హరినాథ్, సామెల్, రవి, రాములు, యాదగిరి, కృష్ణ పాల్గొన్నారు.


ఆర్మీ పోస్టల్ సర్వీస్ జారీ చేసిన ప్రత్యేక కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ, ఎయిర్ కమోడోర్ హెచ్‌జే పేజ్ తదితరులు

స్మారక పోస్టల్ స్టాంపు విడుదల

అల్వాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ బేగంపేట్‌లో ఉన్న భారత వైమానిక దళం ప్రాంతీయ పరీక్షల బోర్డు(శిక్షణ) శుక్రవారం ప్లాటినం జూబ్లీ (75 సంవత్సరాలు) ఉత్సవాలను జరుపుకుంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్(విద్య) ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్ శర్మ సెమినార్‌కు అధ్యక్షత వహించారు. బేగంపేట్ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ కమాండింగ్, ఎయిర్ కమోడోర్ హెచ్‌జే పేజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసంలో గ్రూప్ కెప్టెన్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ, ఏడు దశాబ్దాల బోర్డు ప్రయాణం గురించి వివరించారు. ఈ ముఖ్యమైన సందర్భాన్ని పురస్కరించుకొని ఆర్మీ పోస్టల్ సర్వీస్ జారీ చేసిన ప్రత్యేక కవర్, ప్రాంతీయ పరీక్షల బోర్డు(శిక్షణ)స్మారక పోస్టల్ స్టాంప్‌ను ఎయిర్ వైస్ మార్షల్ రాజీవ్‌శర్మ విడుదల చేశారు.


క్రీడా జ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

యువత క్రీడల్లో రాణించాలి

●ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని ఇగ్నైట్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కేల్ ఇగ్నైట్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అకాడమీ సేవలను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్లు పూజారి వసంత, లక్ష్మణ్, డప్పుకిరణ్, అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాజులరామారం,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం గాజులరామారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఉషోదయ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చైతన్యభార్గవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉషోదయ కాలనీ, చిత్తారమ్మ టెంపుల్, బాలాజీ లేఅవుట్, రాయల్ పార్మర్స్, గాజుల రామారం గ్రామంలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

షాపూర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

షాపూర్‌నగర్,నవంబర్ 8(ఆంధ్రజ్యోతి) షాపూర్‌నగర్ సబ్ స్టేషన్ పరిధి లోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని ఏఈ ఈఎస్ఆర్. కృష్ణ తెలిపారు. ఐడీపీఎ సూరారంలో 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాయిబాబానగర్, పాండుబస్తీ, పుష్పగిరి బస్తీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ట్రాఫిక్ ఫుల్.. నియంత్రణ నిల్!

● గాజులరామారంలో పెరిగిన వాహనాల రద్దీ ● సిగ్నల్స్ ఏర్పాటులో నిర్లక్ష్యం ● నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో జనానికి అవస్థలు

షాపూర్‌నగర్, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం ప్రధాన రహదారిలోని ముఖ్యమైన కూడళ్లలో అనునిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అధికంగా ఉండటం, కొందరి రాంగ్ రూట్ డ్రైవింగ్ కారణంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి.


రోడామిస్త్రీనగర్ చౌరస్తాలో ట్రాఫిక్‌తో ట్రాఫిక్ జామ్


ఈఎస్ఐ బస్టాప్ వద్ద ఆటోల అక్రమ పార్కింగ్

● షాపూర్‌నగర్ ఈఎస్ఐ, జగద్గిరిగుట్ట వెళ్లే పైప్‌లైన్ రోడ్డు చౌరస్తా వద్ద, రోడామిస్త్రీ చౌరస్తా, ఉషాముళ్లపూడి చౌరస్తా తదితర కూడళ్లలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈఎస్ఐ వద్ద ఆటోలను పార్కింగ్ చేయడంతో బస్టాప్‌లో బస్సులు నిలిపేందుకు స్థలం ఉండటం లేదు. దీంతో బస్సులను కొద్ది దూరంలో ఆపుతున్నారు. బస్టాప్‌లో వేచి చేస్తున్న ప్రయాణికులు ఆ బస్సు దగ్గరకు పరుగు పరుగున వెళ్లేలోపు అక్కడి నుంచి వెళ్లిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరూట్‌లో గంట కు ఒక బస్సు మాత్రమే వస్తుందని, ఈ నేపథ్యంలోనే విధి లేక ఆటోల్లో అధిక మొత్తం చెల్లించి ప్రయాణించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.

● రోడామిస్త్రీనగర్ చౌరస్తాలో..

సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు రోడామిస్త్రీ నగర్ ఖాజాపాన్ షాప్ వద్ద ఇసుక వేస్తే రాలనంతగా జనం, వాహనాల రద్దీ కారణంగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. కనీసం ఈ సమయంలోనైనా ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు, జనం అడ్డదిడ్డంగా ప్రయాణించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో కొందరు మైనర్లు రాంగ్ రూట్‌లో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీనికి తోడు సమీపంలోనే వైన్స్ షాపు ఉండటంతో సాయంత్రం 5 అయ్యిందంటే చాలు.. వందల మంది ఆ వైన్స్ దగ్గర గుంపులుగా చేరడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. పోలీసుల వైఫల్యంతోనే ఈ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవుతుందని పలువురు మండిప డుతున్నారు.

● పైప్‌లైన్ రోడ్డు చౌరస్తాలో..

జగద్గిరిగుట్టకు వెళ్లే పైప్‌లైన్ రోడ్డు వద్ద .. నాలుగు రోడ్ల నుంచి వచ్చే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో, ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక వాహనదారులు, పాదచారులు రోడ్డు దాటేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంత రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో సిగ్నల్స్ ఉ ఏర్పాటు చేయకపోవడం విచారకరం. ఎప్పటినుం చో సిగ్నల్ ఏర్పాటు చేయాలని పలువురు నేతలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నా ఆ దిశగా అధికారులు కార్యాచరణను రూపొందించడంలో విఫలమవుతున్నారు. కొన్ని రోజుల క్రితమే ఒక ట్రాఫిక్ పోలీసును నియమించినా తూతూ మంత్రంగానే విధులు నిర్వహిస్తున్నాడని వాహన దారులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ సిగ్నల్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి



పెరిగిన వాహనాలు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గాజులరామారం ప్రధాన రహదారిలోని ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి. అప్పటి వరకు ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కనీసం ట్రాఫిక్ పోలీసులను నియమించాలి. ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ నియమాలు అమలయ్యేలా చూడాలి.

\- అరుణ్‌కుమార్, స్థానికుడు


కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకుంటున్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

దుండిగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, వందలాది మంది కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. వేడుకల్లో శ్రవణ్ కుమార్, ఎ. జేమ్స్, పాలకృష్ణ, శ్రీనివాస్, గడ్డం రాజేంద్రరెడ్డి, గణేష్, శివ, శ్రీధర్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, పద్మారావ్, మైనారిటీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.


సదర్ వేడుకల్లో పాల్గొన్న పీసరి కృష్ణారెడ్డి, యాదవసంఘం సభ్యులు

బౌరంపేట్‌లో సందడిగా సదర్

దుండిగల్, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాల్టీ బౌరంపేట్ గ్రామ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గతంలో సదర్ ఉత్సవాన్ని గండిమైసమ్మ చౌరస్తాలో నిర్వహించే వారని, ఇప్పుడు బౌరంపేట్ గ్రామంలోనే గ్రామవాసులు వీక్షించేలా కన్నుల పండువగా నిర్వహించారని యాదవ సంఘం సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మురళీయాదవ్, సంఘం బృందం ఆహ్వానం మేరకు ఈసమ్మేళనంలో పాల్గొన్నామన్నారు.

ఉల్లాసంగా స్పోర్ట్స్ డే


కరాటే పోటీల్లోని దృశ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): విజ్ఞాన్ జ్యోతి పబ్లిక్ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఉల్లాసంగా జరిగాయి. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్య అతిథిగా మాజీ ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది విచ్చేశారు. క్రమశిక్ష ణ, సహనం, అంకితభావం తో కృషి చేస్తే ఏ రంగంలోనైనా రాణించ వచ్చునని విద్యార్థులకు ఆయన సూచిం చారు. విద్యార్థుల అభిరుచిని గ్రహించి వారికి నచ్చిన రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ జ్యోతి విద్యాసంస్థల అధ్యక్షుడు డి.సురేష్ బాబు, కార్యదర్శి కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న హన్మంత్ రెడ్డి

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హన్మంత్ రెడ్డి శుక్రవారం సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేశారు. దుండిగల్ మున్సిపాల్టీలతో పాటు 125, 129 డివిజన్లకు చెందిన ఏసుదాసు. డేవిడ్, నర్సింహ, ప్రసాద్, పద్మినిలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ. 60వేల చొప్పున మంజూరైంది. ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, డాక్టర్ జేమ్స్, బేకు శ్రీనివాస్, గడ్డం రాజేందర్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


రాజీవ్‌గృహకల్పలో ఐఎన్‌టీయూసీ మహిళా కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న కృష్ణమూర్తి తదితరులు

కార్మికుల సమస్యలపై పోరాడతాం

●ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూరి

నిజాంపేట్, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి ఆపద ఎదురైనా వారికి అండగా ఉంటామని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో స్థానిక మహిళలు ఏర్పాటు చేసుకొన్న నూతన ఐఎన్‌టీయూసీ మహిళా కార్యాలయ భవనాన్ని శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డితో కలిసి అంబటి కృష్ణమూర్తి ప్రారంభించారు. అనంతరం ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింప చేయడంతో పాటు కనీసం వేతనం చెల్లించాలని, చెల్లించకపోతే కార్మికుల పక్షాన ఎల్లవేళలా పోరాడతామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి నాగరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజా శ్రీనివాస్, రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ సతీష్‌బాబు, జాయింట్ సెక్రెటరీ లలిత, రాష్ట్ర ఐఎన్‌టీయూ మహిళా అధ్యక్షురాలు జ్యోతిచౌదరి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుజాతాయాదవ్, కొంపల్లి, బాచుపల్లి, దుండిగల్ మున్సిపాటీల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

జల్సాల కోసం డ్రగ్స్ అమ్మకాలు

●విక్రేతతో పాటు ముగ్గురు కొనుగోలుదారుల అరెస్ట్

జీడిమెట్ల, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడ్డ ఓ యువకుడు అడ్డదారుల్లో డబ్బు సంపాదించేందుకు డ్రగ్స్ విక్రేతగా మారాడు. ఇతడితో పాటు ముగ్గురు కొనుగోలుదారులను మేడ్చల్ జోన్ ఎస్ఓటీ, పేట్‌బషీరాబాద్ పోలీసులు పట్టుకొన్నారు. వీరివద్ద నుంచి రూ. 4 లక్షల 40వేల విలువైన 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుజరాజ్ రాష్ట్రం, భావానగర్‌కు చెందిన గులానీ ఆసిఫ్(30) నగరానికి వచ్చి కొంపల్లి ప్రాంతలోని ఓ బేకరీలో పని చేస్తున్నాడు. జల్సా చేసేందుకు అవసరమైన డబ్బు సంపాదించేందుకు ముంబైలో ఉండే అలీ అనే వ్యక్తి వద్ద నుంచి ఎండీఎంఏతో పాటు, డ్రై గంజాయి తీసుకు వచ్చి నగరంలో సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేస్తూ యువతకు విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం కొంపల్లిలో తరుణ్‌వ్యాస్(30), మహ్మద్ ఇక్బాల్(26), సుశాంత్‌కుమార్‌రెడ్డి(27)లకు విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ శోభన్‌కుమార్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

శరవేగంగా అభివృద్ధి పనులు

●కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీగణేశ్

ఇంటర్వ్యూ



కుత్బుల్లాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీగణేశ్ తెలిపారు. ప్రజావాణిలో ప్రజలు ఫిర్యాదు చేస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, ఇంకా ఎవరైనా సమస్యలను ఎదుర్కొంటుంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీగణేష్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు ఇవీ...

సర్కిల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఏ స్థాయిలో ఉన్నాయి?

సర్కిల్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, ఇండోర్ స్టేడియం నిర్మాణం ఇప్పటికే దాదాపు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రారంభోత్సవం ఉంటుంది. కొన్ని పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచాం.

ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలకు రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రజల విజ్ఞప్తి మేరకు అవసరమైన చోట ఆయా సదుపాయాలను సత్వర చర్యలు తీసుకుంటున్నాం.

షాపూర్‌నగర్‌లోని రంగా, భుజంగా థియేటర్ వద్ద జంక్షన్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగడానికి కారణం ఏమిటి?

రంగా, భుజంగా థియేటర్ వద్ద జంక్షన్ అభివృద్ధి పనులు కొంత ఆలస్యంగా జరుగుతున్న మాట వాస్తవమే. దీనికి కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయి. రంగా, భుజంగా థియేటర్ యాజమాన్యం రోడ్డుపక్కన ఉన్న స్థలం తమదని పనులను అడ్డుకుంటోంది. ఈ స్థలం ఎవరిది అనేది తేల్చేందుకు టీఎస్ఐఐసీ, ఐలా అధికారులను సర్వే నిర్వహించాలని కోరారం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది. వెంటనే పనులు మొదలు పెడతాం.


రౌడీషీటర్లతోమాట్లాడుతున్న ఏసీపీ హన్మంతరావు

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

జీడిమెట్ల,నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు రౌడీషీటర్లను హెచ్చరించారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని 21 మంది రౌడీషీటర్లను పిలిపించి వారితో మాట్లాడారు. ఎలాంటి గొడవల్లో తలదూర్చకుండా మంచి జీవితం గడపాలని సూచించారు. ఎలాంటి అసాంఘీక చర్యలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నర్సింహ, ఎస్ఐలు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఉండి ఏం లాభం?

● నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో వారం రోజులుగా వెలగని లైట్లు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
●మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు వేడుకోలు


అలంకారప్రాయంగా మారిన స్ట్రీట్‌లైట్

దుండిగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్ పరిధిలోని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో వారం రోజులుగా వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. వీధి దీపాలు పని చేయకపోవడంతో రాత్రి వేళల్లో పలు కూడళ్లలో పోకిరీలు తిష్టవేసి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. రాత్రి వేళల్లో వీధి కుక్కలు పాదచారులపై విరుచుకు పడుతున్నాయని, దీనికి తోడు రోడ్లపై పాములు సంచరిస్తున్నాయని వెంకటసాయి కృష్ణ, బృందావన్, దక్ష ఎన్‌క్లేవ్, వాలీ అపార్ట్‌మెంట్ వాసులు అంటున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళలో వారాంతపు సంతకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే మహిళలు పాములు, కుక్కల భయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు పిచ్చిమొక్కలు తీగలుగా అల్లుకొని ఉన్నాయని, వాటిని కూడా తొలగించడం లేదని అంటున్నారు. కొంపల్లి మున్సిపల్ అధికారులు కాలనీల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఉన్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేసి విద్యుత్ దీపాలకు అయ్యే ఖర్చును ఇస్తే అప్పుడైనా అధికారులు స్పందిస్తారా అని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీతో పాటు పలు కాలనీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు

కొంపల్లి మున్సిపల్‌లోని 12, 13వ వార్డుల్లో విద్యుత్ దీపాలు పనిచేయడం లేదని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. కనీసం మరమ్మతులు చేయడం గానీ, విద్యుత్ స్తంభాలకు అల్లుకొన్న పిచ్చిమొక్కల తీగలను కూడా తొలగించడం లేదు.

\- పోతూరి శివాజీరాజా, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్



సమావేశంలో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్‌సీలను ప్రకటించాలి

కుత్బుల్లాపూర్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరికీ డీఏ, పీఆర్‌సీలను వెంటనే ప్రకటించాలని, ఈహెచ్ఎస్ కార్డు ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందించాలని వీఓటీటీ ప్రధాన సంపాదకుడు పాపన్నగారి మాణిక్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు ఎస్.పురుషోత్తం అధ్యక్షతన మండల మహాసభలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కె.జయసింహారెడ్డి, కమల్‌సింగ్, గొడుగు శ్రీనివాస్, 2024-25 సంవత్సరానికి టీఎస్‌యూటీఎఫ్ కుత్బుల్లాపూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా కె.కుమారస్వామి, మహిళా ఉపాధ్యక్షులుగా ఎ.వసంత, కోశాధికారిగా, ఎఫ్ఎంఎఫ్ కన్వీనర్‌గా ఎం.సంతోష్‌లను ఎన్నుకున్నారు.

అత్తపై అత్యాచారం చేసిన అల్లుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ : మత్తుమందు ఇచ్చి అత్తపై అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్న అల్లుడు మొహమ్మద్ షాకేర్‌ను బాలాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన షాకేర్ అత్తకు కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి స్పృహ కోల్పోయాక ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు షాకేర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.